# సాహిత్యవేదిక ప్రథమవార్షికోత్సవ వేడుకలు

ఉత్తర టెక్సాస్ తెలుగుసంఘం (టాంటెక్స్) వారి సాహిత్యవేదిక ప్రథమవార్షికోత్సవ సందర్భంగా డల్లాస్ నగరంలోని స్థానిక హిందూదేవాలయంలో నేడు ఒకరోజంతా సాహిత్యసంగీత సమ్మేళనం జరిగింది. ఆంధ్రప్రదేశ్ నుండి వచ్చిన ప్రముఖ సాహితీవేత్తలు గొల్లపూడి మారుతీరావు, బలభద్రపాత్రుని రమణి, రాళ్ళబండి కవితాప్రసాద్, తెలుగు అకాడమీ సంచాలకులు ఆచార్య ప్రతాప్ రెడ్డి, ప్రముఖ సినీగాయకులు జి.ఆనంద్ విశిష్ట అతిథులుగా హాజరయిన ఈ వేడుకలు ఉదయం పదిగంటలకు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభం అయ్యాయి. మంజు తెలిదేవర, గాయత్రి భోగవల్లి మా తెలుగుతల్లికి మల్లెపూదండ గీతం ఆలపించిన పిదప టాంటెక్స్ అధ్యక్షురాలు శ్యామ రుమాళ్ళ స్వాగతోపన్యాసం చేయగా, తానా కార్యదర్శి ప్రసాద్ తోటకూర నిర్వహణలో సాహిత్యగోష్టి మొదటి విభాగం ప్రారంభమయింది. ప్రముఖ నవలారచయిత్రి బలభద్రపాత్రుని రమణిని ఎమ్వీయెల్ ప్రసాద్ సభకు పరిచయం చేసిన పిదప "తెలుగు సినిమాలపై నవలల ప్రభావం" అనే అంశంపై ఆవిడ ప్రసంగించారు. మాలపల్లి మొదలుకుని, శరత్ నవలలు, మాదిరెడ్డి, యుద్దనపూడి, కోడూరి, యండమూరి వంటి రచయితల నవలలు సినిమాలుగా తీయబడిన వైనాన్ని, ఆ నవలల్లోని సామాజికాంశాలు ఆయా సినిమాల్లో ప్రతిబింబించబడ్డ విధానాన్ని ఆవిడ సోదాహరణంగా వివరించారు. బహుముఖప్రజ్ఞాశాలి గొల్లపూడి మారుతీరావును ప్రసాద్ తోటకూర సభకు పరిచయం చేశారు. ఆయన తన కీలకోపన్యాసంలో "ఆత్మకథల కథ" అనే అంశంపై ప్రసంగిస్తూ తాను చదివిన అనేకమంది ప్రముఖుల ఆత్మకథలను సభకు పరిచయంచేస్తూ, ఆత్మకథల్లోని వివిధ కోణాల్ని,వాటిల్లో రాయదగిన,రాయగూడని అంశాలను ప్రస్తావించారు.





మధ్యాహ్నభోజన విరామం తర్వాత చంద్రశేఖర్ కన్నెగంటి నిర్వహణలో ప్రారంభమయిన రెండోవిభాగంలో "తెలుగుభాష ప్రాశస్త్యం-భవిష్యత్తు" అనే అంశంపై డా॥ ప్రతాప్ రెడ్డి ప్రసంగిస్తూ తెలుగుభాషకు ప్రాచీనభాష హోదా ఎందుకు అవసరమో వివరించారు. ఆ తర్వాత రాళ్ళబండి కవితాప్రసాద్ అవధానం మొదలయింది. ఎంతో వేగంగా, కేవలం 45 నిమిషాల్లో ముగిసిన ఈ అవధాన కార్యక్రమం సభికుల్ని ఎంతో అలరించింది. రాళ్ళబండి అలవోకగా పృచ్ఛకులు అడిగిన సమస్యల్ని పూరించిన వైనం సభని రంజింపజేసింది.ఆచార్య పుదూర్ జగదీశ్వరన్ ఈ అవధానానికి సంధానకర్తగా వ్యవహరించగా, పులిగండ్ల విశ్వనాథం, డా ఆళ్ళ శ్రీనివాసరెడ్డి, లంకా చంద్రశేఖర్, డా॥ రమణ జువ్వాడి, రావు కల్వల, వంగూరి చిట్టెన్‌రాజు, ప్రసాద్ తోటకూర, కె.సి చేకూరి తదితరులు పృచ్ఛకులుగా వ్యవహరించారు. అవధానం అనంతరం ప్రముఖ నేపథ్య గాయకులు జి.ఆనంద్ తన గానమాధుర్యంతో సభని అలరించారు.





తేనీరు విరామం తర్వాత కె.సి చేకూరి నిర్వహణలో గోష్ఠి మూడవ విభాగం మొదలయింది. స్థానిక రచయితలు, కవులు పాల్గొన్న ఈ విభాగంలో వంగూరి చిట్టెన్‌రాజు, శ్రీమతి అత్తలూరి విజయలక్ష్మి, డా॥ రమణ జువ్వాడి,ఆచార్య పుదూర్ జగదీశ్వరన్,చంద్రశేఖర్ కన్నెగంటి, నందివాడ ఉదయభాస్కర్, గాయత్రి భోగవల్లి, డా। బోయరెడ్డి సుబ్రమణ్యం, డా॥ తారాకుమార్ రెడ్డి, డా॥ నరసింహా రావు తదితరులు ప్రసంగించారు. డా ఆళ్ళ శ్రీనివాసరెడ్డి తన జానపదగీతాలతో సభను హుషారెత్తించారు.

సాయంకాలం విశ్వనాథం పులిగండ్ల నిర్వహణలో నాలుగవ విభాగంలో శాస్త్రీయసంగీత విభావరి మొదలయింది. శాంత పులిగండ్ల నేతృత్వంలో మంజు తెలిదేవర, గాయత్రి భోగవల్లి, పేదుల అపర్ణ, ధర్మవరపు శిరీష, అవధానుల విశాల గారి బృందం ఆలపించిన అన్నమయ్య, త్యాగరాజు కీర్తనలు సభను రసజగత్తులో ఓలలాడించాయి.

అనంతరం విశిష్ట అతిథులందరినీ టాంటెక్స్ అధ్యక్షురాలు శ్యామ రుమాళ్ళ, ఇతర కార్యవర్గ సభ్యులు దుశ్శాలువలతో, జ్ఞాపికతో సత్కరించారు. సాహిత్యవేదిక ఆవిర్భావానికి పునాది వేసిన వ్యవస్థాపకులు ప్రసాద్ తోటకూరను టాంటెక్స్ సాహిత్యవేదిక తరపున విశిష్ట అతిథులందరూ కలిసి సత్కరించారు. హిందుదేవాలయానికి, భోజన సదుపాయం కల్పించిన సరిగమ, కోకిల, రుచి ప్యాలెస్ తదిర ఇండియన్ రెస్టారెంట్లకు, సభనిర్వహణకు సహకరించిన రాజేష్ పిల్లమర్రి, రాజారెడ్డి, అనంత్ మల్లవరపు, సురేష్ మండువ, శ్రీనివాస్ వీరపెల్లి, ఎస్సెమెస్ రెడ్డి, చంద్ర బందార్, సాంబ దొడ్డా, రాధాకృష్ణ ఎర్రంనేని తదితరులకు ధన్యవాదాలు తెలుపుతూ కె.సి చేకూరి వందన సమర్పణతో ఈ వేడుకలు ముగిశాయి.

